

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**ఇండియాలోలాగా** కాకుండా ఇక్కడ ప్రతి క్లాసుకి అసైన్‌మెంట్లు ఇస్తున్నారు. అసైన్‌మెంట్లు కూడా అక్కడిలాకాక చదువుకుని రాసేవి. మొదట్లో కష్టంగా అనిపించినా పోను పోను అలవాటయిపోయింది. ప్రతి వారం ఒక అసైన్‌మెంటు, రెండు మిడ్‌టరమ్స్ ఎగ్జామ్స్, ఒక ఫైనల్ ఎక్జాం. మిడ్‌టర్మ్ –1 కి చదివినవి మళ్ళీ చదవనక్కరలేదు. మిడ్‌టర్మ్ – 2 వి ఫైనల్ ఎక్జామ్లో రావు. ఏ ఎక్జాంది ఆ ఎక్జామే. ఇది తెలిసిన తరువాత నేను ఎంతో ఆనందించాను. విచిత్రంగా కొన్ని సబ్జెక్ట్స్‌కి ఓపెన్ టెక్స్ట్ బుక్. ఎక్జాంలో టెక్స్ట్ బుక్‌ని వాడచ్చు. ఎంత వింతగానో అనిపించింది. ఆ మాత్రం దానికి ఎక్జాం ఎందుకో?

క్లాసులు మొదలైన వారానికి నేను డార్మ్ కి మారాను. హనీషనుండి దూరం వెళుతున్నందుకు ఎంతో దిగులు కలిగింది. అదృష్టవశాత్తూ నాకు దొరికిన రూమ్మేట్ కూడా వెజిటేరియన్.

ఫోన్‌లో అమ్మ చెప్పిన "నాన్ వెజ్ విడిగా పెట్టమను, వేరే అరలోనే ఉంచమను, నువ్వు పైన అరతీసుకో, కిందది తీసుకుంటే పైనవి కారే అవకాశం ఉంది. నీ ప్లేట్లు, స్పూన్లు తనని వాడద్దని గట్టిగా చెప్పు, గిన్నెలు తోమడానికి పీచుని కూడా వేరుగా పెట్టుకోండి" వంటి సలహాలు వృధా అయ్యాయి. డార్మ్ హనీష, వెన్నెల వాళ్ళ ఇంటినుండి రెండు నిమిషాల నడక దూరంలో ఉంది. "రోజూ ఇక్కడే తిను. అక్కడ ఒక్కదానివి ఏం వండుకుంటావు?" వెన్నెల అంది.

"క్లాస్ అయ్యాక లేదా క్లాసుల మధ్యలో టైం ఉన్నప్పుడు వచ్చేయ్. ఇంట్లోనే ఉంటాను" హనీష అంది.

మొదటిరోజు సూట్‌కేసులో బట్టలు సర్దుకుని, టేబుల్ మీద బుక్స్ పెట్టాను. సాయంత్రం 7.30 వరకు నా రూమ్మేట్ రాకపోవడంతో నేను హనీష వాళ్ళ ఇంటికి వెళ్ళాను. ఆ రాత్రి అక్కడే ఉండిపోయాను. రెండో రోజు కూడా నా రూమ్మేట్ కనబడలేదు. హనీష వాళ్ళ ఇంట్లో భోంచేసి ఇష్టంలేకపోయినా రాత్రి నా గదిలోనే నిద్రపోయాను. ఇంకనుండి ఇక్కడే ఉండాలి అని సర్ది చెప్పుకున్నాను. హనీష వాళ్ళ ఇంట్లో రోజూ ఎవరో ఒకళ్ళు వస్తూ పోతూ ఉండేవారు. ఇక్కడ అస్సలు సందడే లేదు. ఎన్ని రోజులైనా దిగులు తగ్గలేదు. నాలుగోరోజు మొత్తానికి నా రూమ్మేట్ వచ్చింది.

"హాయ్, యూ మస్ట్ బీ మై న్యూ రూమ్మేట్"

"యస్, ఐం అవని" అన్నాను.

"హౌ స్వీట్ ఐం నేహ" అంది.

తను బయోకెమిస్ట్రీలో మాస్టర్స్ చేస్తుందని, తన బాయ్‌ఫ్రెండ్ మెకానికల్ ఇంజనీరింగ్ చదువుతున్నాడని చెప్పింది. తను చాలా వరకు బాయ్‌ఫ్రెండ్ రూములోనే ఉంటుందని ఇక్కడికి కేవలం కొన్ని రోజులు మాత్రమే వస్తుందని చెప్పింది. నేను ఎంతో ఆశ్చర్యపోయాను. బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడని ఒప్పుకోవడం ఒక ఎత్తైతే, కలిసి ఉండడం ఇంకో ఎత్తు. వెంటనే హనీషకి ఫోన్ చేసి వాళ్ళ ఇంటికి వెళ్ళాను.

"నేహ తన బాయ్‌ఫ్రెండ్‌తో ఉంటుందట" అన్నాను.

"నీకే మంచిది కదా మొత్తం రూం నీదే" హనీష అంది.

"ఔను కదా" అనుకున్నాను.

"ఇక్కడ అవన్నీ కామన్. దాదాపు అందరికీ బాయ్‌ఫ్రెండ్స్, గర్ల్‌ఫ్రెండ్స్ ఉంటారు. నీకు అలవాటైపోతుందిలే" అంది.

కొద్దిసేపయ్యాక "నేను ఒకరోజు ఏడ్చాను గుర్తుందా?" అడిగింది.

"యా. గుర్తుంది"

"ఆరోజు నా బాయ్‌ఫ్రెండ్‌తో గొడవైంది."

"ఓ, ఔనా?"

"వాళ్ళ ఇంట్లో పెళ్ళి సంబంధాలు చూస్తున్నారట. నాగురించి చెప్పాలంటే భయం వేసిందన్నాడు."

"అయ్యో ఇప్పుడు అంతా ఓకేనా?"

"యా, ఓకే"

కాసేపు నిశ్శబ్దం తరవాత "అతని పేరేంటో చెప్పిందా?" అడిగింది.

"లేదు"

"మెకానికల్ అన్నావు కదా?"

"ఔను"

"అయితే పీయుష్ అయ్యుంటాడు. వాళ్ళెప్పుడు కలిసే ఉంటారు."

"ఓ. ఓకే"

"నీకు అతని గురించి ఏమైనా చెపితే నాకు చెప్పు."

"సరే" నవ్వాను.

"ఎలా ఉంది నీ రూం? రూమ్మేట్‌ని కలిసావా? " మాటల్లో వెన్నెల ఇంటికొచ్చింది.

హనీసకి చెప్పిందంతా వెన్నెలకి చెప్పాను.

"హనీష గాసిప్ క్వీన్. నువ్వు ఎంత చెపితే అంత అడుగుతుంది జాగ్రత్తరోయ్" నవ్వింది వెన్నెల.

"గాసిప్స్ లేకపోతే లైఫ్ బోర్ వెన్ని" హనీష కూడా నవ్వింది.

"ఫ్రెషర్స్ పార్టీకి ఏం వేసుకుంటున్నావు?" వెన్నెల అడిగింది.

"నేను వెళ్ళట్లేదు" అన్నాను.

"ఎందుకని?" హనీష, వెన్నల ఇద్దరూ ఆశ్చర్యపోతూ అడిగారు.

"నాకు పార్టీలు నచ్చవు."

"ఇది బానే ఉంటుంది" వెన్నెల నవ్వింది.

"నీ బాచ్ వాళ్ళందరూ వస్తారు. ఇక్కడే ఫ్రెండ్స్ అయ్యేది" హనీష చెప్పింది.

"కరెక్టేకానీ నాకు బోర్ కొడుతుంది" అన్నాను.

"మేమందరం ఉంటాముకదా, ఏం బోర్ ఉండదు" హనీష అంది.

"ఒక్కటేసారి ఉంటుంది ఫ్రెషర్స్ పార్టీ. ప్లస్ నీ లైఫ్‌లో ఇదే లాస్ట్ ఫ్రెషర్స్ పార్టీ" వెన్నెల అంది.

"సరే వెళ్తానులే" అన్నాను.

ఉదయం లేచేసరికి నా రూమ్మేట్ పాటలు వింటూ కిచెన్‌లో ఉంది. నన్ను చూసి "గుడ్‌మార్నింగ్" చెప్పింది.

"గుడ్‌మార్నింగ్" బదులుగా చెప్పాను. తను నా స్నేహితురాలయితే ఎందుకు అంత ఆనందంగా ఉందో అడిగేదాన్ని.

"డూ యూ ఈట్ ఎగ్?" అడిగింది.

"యస్, నాట్ బిఫోర్ ప్రేయర్" అన్నాను.

నేను స్నానం చేసి పూజ చేసేసరికి తను మా ఇద్దరికి బ్రేక్‌ఫాస్ట్ వండుతానంది. సరే అని వెళ్ళాను. నేను అనుకున్నట్టు బ్రెడ్ ఆంలెట్ కాకుండా హేష్‌బ్రౌన్‌లో ఎగ్‌ని కలిపి ఏవో స్పైసెస్‌తో చేసింది. రుచి చాలా బాగుంది .ఉదయం ఆరోగ్యానికి వెజిటబుల్ జ్యూస్ మంచిది అని నాకు ఒక గ్లాస్ టమాటా జ్యూస్ ఇచ్చింది. అందులో సరిగ్గా సరిపోయేంత ఉప్పు వేయడంతో ఎంతో రుచిగా ఉంది. కాంపస్ మొత్తం చూసావా అని అడిగింది, ఆ తరవాత ఊళ్ళో ఎక్కడెక్కడికి వెళ్ళావు అని అడిగింది .కాంపస్ బయటకి ఎక్కువ వెళ్ళలేదు అని చెప్పాను.

"యు హేవ్ టు గో హియర్, దేర్..." అని అనేక పేర్లు చెప్పింది. సరే అన్నాను. వీకెండ్ తనకి కుదిరితే ఊరు చూపిస్తానని చెప్పింది. 'సరే 'అన్నాను. ఒక పుస్తకం తీసి "డూ యు లైక్ నికొలస్ స్పార్క్స్?" అడిగింది.

"ఐ హేవ్ ద సేమ్ బుక్ ఫ్రమ్ లైబ్రరీ" అన్నాను.

"దిస్ ఈజ్ యువర్స్. కెన్ ఐ రీడ్?" నవ్వుతూ అడిగింది.

"యెస్. ఐ నీడ్ ఇట్ బేక్ బై నెక్స్ట్ వీక్" అన్నాను. నాకు చెప్పకుండా తను నా పుస్తకం తీసుకోవడం నాకు ఏ మాత్రం నచ్చలేదు. కానీ అన్నయ్య అందరితో స్నేహంగా ఉండమన్నాడు కనుక నేను ఏమీ అనలేదు. ఇద్దరం కలిసి మాట్లాడుతూ గిన్నెలు కడిగాము. ఆ తరవాత క్లాస్‌కి టైం అయిందని బయలుదేరిపోయింది. విచిత్రంగా క్లాసుకి ఒక మోకాళ్ళపైదాక ఉన్న డ్రెస్ వేసుకుని వెళ్ళింది. కేంపస్‌లో అలాంటి బట్టలు వేసుకున్న వాళ్ళని చాలామందినే చూసాను కానీ క్లాసుకి అలా మన ఇండియన్స్ వేసుకోవడం చూసి ఆశ్చర్యపోయాను. వెంటనే హనీషకి మొత్తం కథ చెప్పాను.

"నేనూ అలానే వేసుకుంటాను. ఇక్కడ చాలా కామన్. ప్రొఫెసర్లు పట్టించుకోరు. డీసెంట్‌గా ఉంటే చాలు" అంది.

తను నిజంగా వేసుకుంటుందా లేక నన్ను ఆటపట్టిస్తుందా అర్థంకాలేదు.

తరువాత లాబ్‌కి వెళ్ళి కొద్దిసేపు చదువుకున్నాను. ఇంతలో రెయిన్ వచ్చి మాట్లాడింది. ఇద్దరం కలిసి తెలియకుండానే దాదాపు గంటసేపు ఆకాయ్ సోకాయ్ కబుర్లు చెప్పుకున్నాము. తనకి క్లాసు టైం అయిందని వెళ్ళిపోయింది.

సరిగ్గా రెండు వారాల క్రితం నేను ఎంతో గుబులుతో ఉన్నాను. హనీష వాళ్ళ ఇంటినుండి వెళ్ళాలి అంటే చాలా బెంగ కలిగింది. లాబ్‌లో పనిచెయ్యాలంటే ఎంతో భయమేసింది. వీళ్ళ మధ్యలో నేను సరిపోతానా అని ఎంతో భయపడ్డాను. రూమ్మేట్ మంచిది కాదేమో అని నాలో నేను చాలా కుమిలిపోయాను.

ఇప్పుడు నేను ఉన్నంత సంతోషంగా ఉంటాను అని అనుకోలేదు. తెలియకుండానే రెయిన్, నేహాలతో స్నేహం ఏర్పడింది. అభిషేక్, రాం, లయన్ వంటివారు పరిచయమయ్యారు. నేను ఇక్కడ ఎంత సంతోషంగా, బెంగలేకుండా, హాయిగా ఉన్నానో అమ్మ తెలుసుకోగలిగితే ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. ఫోన్ మాట్లాడిన ప్రతిసారి అమ్మ గొంతులో బెంగ తెలుస్తూనే ఉంది. అమ్మ అంత బెంగపడుతుంటే ప్రాణం ఉసూరుమంటుంది. ఏదో రకంగా నేను నిజంగా బావున్నానని అమ్మకి అర్థం అయితే ఎంత బావుండో!

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story